అంగన్వాడీ పోస్టుల భర్తీలో అవకతవకలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని పిసిరిమామిడి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత పాటించలేదని గ్రామస్తురాలు వంతల అప్పలమ్మ ఆరోపించారు. శుక్రవారం పాడేరులో జరిగిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె ఈ విషయాన్ని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేసింది. బాధిత అప్పలమ్మ తెలిపిన వివరాల ప్రకారం... చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, మినీ అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి చేపట్టిన నియామకాల్లో తాను దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపింది. నిరాధార కారణాలతో తన దరఖాస్తును తిరస్కరించినట్లు ఆమె వాపోయింది. ఆయా ఉద్యోగాలకు తాను అవసరమైన అర్హతలు కలిగి ఉన్నానని, తాను అన్ని ధృవపత్రాలను తీసుకువెళ్లినా పరిశీలించకుండా తిరస్కరించడం అన్యాయమని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

నేటి నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు

- ముస్తాబైన ఆలయం
- ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

విద్యుత్ దీపాల వెలుగులతో మెరిసిపోతున్న ఆలయం

ప్రజాశక్తి-పాడేరు: మన్య ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు పాడేరు పట్టణంలో ఈనెల 11వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాల సందర్భంగా పాడేరులోని అమ్మవారి దేవాలయానికి రంగులు వేసి ముస్తాబు చేశారు ఆలయం లోపల అమ్మవారి మూల విరాట్ విగ్రహాన్ని పువ్వులతో అందంగా అలంకరించారు. కొండమ్మ అమ్మవారిని కొలువు తీర్చేందుకు పట్టణంలోని మెయిన్ రోడ్ ప్రాంగణంలో శతకంపట్టు ఏర్పాటు చేశారు. ఆదివారం వేకువజామున అమ్మవారి ఆలయం నుంచి కొలువుత్సవాన్ని నిర్వహించి అమ్మవారి పాదాలు ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించి శతకం పట్టులో ప్రతిష్ఠించనున్నారు. భక్తులు ఊరేగించేందుకు 100 ఘటాలను సిద్ధం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఆలయ కమిటీ/ ఉత్సవ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో మూడు రోజులు మోదకొండ అమ్మవారి ఉత్సవాలను నిర్వహించేందుకు పట్టణంలో పలు ఏర్పాట్లు చేశారు. పట్నంలోని మూడు రోడ్ల అంబేద్కర్ కూడలి నుంచి మూడు వైపులా ప్రధాన రహదారులకు విద్యుత్ దీపాల అలంకరణ చేశారు. ఉత్సవాల మూడు రోజులు వీక్షించేందుకు వినోదాత్మక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు నిర్వహించారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, ప్రతి ఏటా నిర్వహించే విధంగానే ఈసారి మోదకొండ మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

పోలీస్ బందోబస్తు

ఈనెల 11, 12, 13 తేదీలలో పాడేరు లో జరిగే మోద కొండమ్మ అమ్మవారి జాతర సందర్భముగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పి అమిత్ బర్గర్ పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేశారు. భద్రత చర్యలు లో బాగంగా డ్రోన్‌లు, సీసీ కామెరాలు, శక్తి టీంలు డాగ్ స్క్వాడ్‌లతో పర్యవేక్షణ చేస్తున్నారు.

వాహనాలు మళ్లింపు

మోదకొండమ్మ ఉత్సవం జరిగే మూడు రోజులలో భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ మళ్లించారు. అరుకు, హుకుంపేట, పెదబయలు, ముంచింగుపుట్టు నుండి చోడవరం వైపు వెళ వాహనములు ఆడారిమెట్ట మీదుగా సన్యాసంపల్లి మీదుగా వంతాడపల్లి చెక్పోస్ట్ మీదుగా మళ్ళించారు చోడవరం, వైజాగ్ నుంచి వచ్చే వాహనాలు అరకు గానీ హుకుంపేట, ముంచంగిపుట్టు, పెదబయలు వెళ్ళవలసిన వారు ఎంపీడీవో ఆఫీస్ పక్క నుండి డిగ్రీ కాలేజ్, సినిమా హాల్ సెంటర్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు మళ్లించారు.

జి.మాడుగుల నుండి అరుకు వెళ్ళవలసిన వాహనాలు సెయింట్ ఆన్స్ జంక్షన్ దగ్గర కుడివైపు తీసుకుని నక్కల పుట్టు మీదుగా ఎంపీడీవో ఆఫీస్ పక్క నుండి డిగ్రీ కాలేజ్, సినిమా హాల్ సెంటర్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు మళ్లించారు.అరకు నుండి జిమాడుగుల వైపు వెళ్ళవలసిన వారు ఆడారి మెట్ట మీదుగా సన్యాసంపల్లి మీదుగా వంతాడపల్లి చెక్పోస్ట్ ప్రక్కనుండి నక్కల పుట్టు మీదుగా లగిసిపల్లి నుండి సెయింట్ ఆన్స్ కు వచ్చి జిమాడుగుల వైపు మళ్లించారు.పెద్ద వాహనాలకు ఈ మూడు రోజులు ఘాట్ రోడ్లోకి, పాడేరు టౌన్‌లోకి అనుమతి నిలుపుదల చేశారు.

విద్యుత్ మోటారు ఏర్పాటు

ప్రజాశక్తి కథనానికి స్పందన

విద్యుత్ పరికరాలు అమరుస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ శాండికోరి గ్రామంలో సోలార్ మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని సోలార్ మోటారు బదులు విద్యుత్ మోటారు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. మబ్బులు వేసినప్పుడు సోలార్ మోటారు పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య మరింత అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు కిలోమీటర్ల దూరం నడచి వెళ్లి బూసికొండ గ్రామంలో తాగునీరు తీసుకురావాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. సమస్యని 'ప్రజాశక్తి' దృష్టికి తీసుకురావడంతో ఇటీవల కథనం ప్రచురితమైంది. స్పందించిన సర్పంచ్ కేలేబి కుమారి యుద్ధప్రాతిపదికన శనివారం విద్యుత్‌మోటార్ అమర్చడంతో సమస్య తీరింది. సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

చురుగ్గా నీటి తొట్టెల నిర్మాణ పనులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని ఉపాధి పథకంలో భాగంగా నీటితొట్టెల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని స్థానిక ఉపాధి హామీ ఎపిఒ రెడ్డిబాబు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న నీటితొట్టె నిర్మాణ పనులను శనివారం ఆయన పర్యవేక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 110 నీటితొట్టెల నిర్మాణాలు చేపట్టగా ఇప్పటివరకు 84 పూర్తయ్యాయని మరో వారం రోజుల్లో మిగతావి పూర్తవుతాయని తెలిపారు. ఒక్కొక్క నీటితొట్టెకు ప్రభుత్వం రూ.30వేలు ఖర్చు చేస్తోందని తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పనులను పర్యవేక్షిస్తున్న ఉపాధి సిబ్బంది

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు

ప్రజాశక్తి-వి ఆర్‌పురం: విఆర్ పురం, కూనవరం, చింతూరు, ఎటపాకలో విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీ సైకిల్, ట్రై సైకిల్, వీల్ చైర్, చెవిటిమిషన్లు, చేతికర్రలు, అంధులకు చేతికర్రల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. బ్యాటరీ సైకిల్ కోసం 80 శాతం వరకూ వైకల్యం ఉండాలన్నారు. విభిన్నప్రతిభావంతులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ తీసుకుని రావాలన్నారు.చింతూరు మండలానికి చెందిన కంటిమూచిక దుర్గారావు,ఎర్రంపేట ఎజిహెచ్ గర్ల్స్ స్కూల్, నరసింహపురం చిరునామాకు పంపాలన్నారు. లేదా 9100735070 నంబర్‌ను సంప్రదించాలన్నారు.వి ఆర్ పురం, మండలం కూనవరం,ఏటపాక గ్రామాలకు చెందినవారు రేఖపల్లి ఎఎస్‌డిఎస్ కార్యాలయంలో అందించాలన్నారు.

అటవీ ప్రాంత సంరక్షణకు చర్యలు

ఉప అటవీ అధికారి వెంకటరాజు

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి అటవీ డివిజన్ పరిధిలో అటవీ సంరక్షణను మరింత పటిష్టం చేసేందుకు అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఉప అటవీ పరిధి అధికారి(డిఆర్ఓ) డి.వెంకటరాజు తెలిపారు. శుక్రవారం రాత్రి చింతపల్లిలోని అడవుల్లో పర్యవేక్షణ చేపట్టామన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అటవీ ప్రాంతంలో స్ట్రైకింగ్ ఫోర్స్‌తో కలిసి విస్తృతమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందులో భాగంగా, సిగినాపల్లి, గుర్రాలగొంది అటవీ ప్రాంతాల్లోని రంగురాళ్ల క్వారీలలో అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు ప్రత్యేకంగా బేస్ క్యాంపును ఏర్పాటు చేశామన్నారు. విలువైన టేకు తోటలను పరిరక్షించేందుకు, వాటిని అక్రమంగా తరలించకుండా నిరోధించేందుకు ముఖ్యమైన రహదారులపై, టేకు తోటల వద్ద రాత్రివేళల్లో స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశామని తెలిపారు. రాత్రి వేళల్లో అడవుల్లో అనుమానాస్పదంగా తిరుగుతూ వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఎవరైనా అటవీ నేరాలకు పాల్పడితే, వారిపై అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. మానవాళికి జీవనాధారమైన అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న వెంకటరాజు

ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న సొసైటీ సభ్యులు

బస్‌స్టాప్ స్థలం ఆక్రమణదారులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలం లోతేరు గ్రామ పంచాయతీ కేంద్రంలో ప్రధాన రహదారికి పక్కన ఉన్న ఆర్టీసీ బస్ స్టాప్‌ను కొందరు స్థానికులు ఆక్రమించారని ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, స్థానిక గ్రామస్తులు శనివారం మండల తహశీల్దార్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మాట్లాడుతూ, బస్ స్టాప్ నిర్మాణం చేసి సుమారు 20 సంవత్సరాలు గడిచిందని,ప్రస్తుతం లోతేరు బస్ స్టాప్ శిథిలావస్థకు చేరుకోవడంతో కొందరు స్థానికులు ఆ స్థలంపై కన్నేసి ఆక్రమిస్తున్నారని తెలిపారు. ప్రయాణికుల విశ్రాంతి కోసం బస్ స్టాప్ నిర్మిస్తే, కొందరు లోతేరు గ్రామం స్థానికులు ఆ స్థలమును ఆక్రమించుకొని వాణిజ్య సముదాయము నిర్మించుకొని వారి సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. బస్ స్టాప్ స్థలం ప్రభుత్వానిది అని ఎలా ఆక్రమణ చేస్తున్నారని మండి పడ్డారు. ఆక్రమణదారులపై చట్టపరమైన, శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కిల్లో అప్పలస్వామి, పట్టాసి కొండలరావు, అడారి అజయ్, పాంగి చిన్నబాబు, శెట్టి మధుసూదన్, త్రినాథ్, శంకర్, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం.. మాతృమూర్తి కళారూపం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి తన సూక్ష్మ కళతో మాతృమూర్తికి వందనాలు సమర్పించాడు. ఆదివారం మాతృ దినోత్సవం పురస్కరించుకొని చెక్కతో తల్లి బిడ్డ ప్రతిరూపాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాడు. ఈ అద్భుత కళారూపాన్ని చెక్కిన రవి పలువురు అభినందించారు.

జాతీయ రక్షణ నిధికి స్పీకర్ అయ్యన్న విరాళం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన ఒక నెల వేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా అందజేశారు. ఆన్లైన్ పేమెంట్ ద్వారా 2 లక్షల విరాళాన్ని ఆయన జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మన దేశ సాయుధ దళాలు ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు చేస్తున్న ధైర్యసాహసాలు ప్రతి భారతీయునిలో స్ఫూర్తిని రగిలి స్తోందన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న వీర జవాన్లకు ఒక నెల వేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చానని తెలిపారు. ఉగ్రవాద నిర్మూలనలో సాయుధ దళాలు ప్రదర్శిస్తున్న ధైర్యసాహసాలు దేశ ప్రజలందరికీ గర్వకారణంగా నిలుస్తున్నాయని స్పీకర్ కొని యాడారు.

అశ్రునయనాలతో పండన్నకు అంత్యక్రియలు

ప్రజాశక్తి-సీలేరు: ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ మావోయిస్టు కీలకనేత కాకూరు పండన్న అలియాస్ జగన్ అంత్యక్రియలు జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ ఆయన స్వగ్రామం కొమ్మలవాడలో శనివారం నిర్వహించారు. జగన్ వై.రామవరం మండలం కొయ్యూరు సరిహద్దు శేషరాయి అటవీ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో ఈ నెల 7వ తేదీ సాయంత్రం మృతి చెందిన విషయం తెలిసిందే. అనంతరం మృతదేహాన్ని రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని అప్పగించారు. కాకురు పండన్న అలియాస్ జగన్ 30 సంవత్సరాలు మావోయిస్టు ఉద్యమంలో ఉంటూ కుటుంబ సభ్యులు పోలీసులు ప్రలోభాలకు లొంగకుండా ఉద్యమమే ఊపిరిగా కొనసాగారు. మాజీ మావోయిస్టులు అభిమానులు, బంధువులు అంత్యక్రియలకు తరలివచ్చారు. ఆయన మృతదేహాన్ని భద్రపరచడంలో వైద్యసిబ్బంది విఫలమయ్యారు. మృతదేహాన్ని అప్పగించడంలో కూడా ఆలస్యం చేశారని వారు ఆరోపించారు. మాజీ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు జాబ్రి అలియాస్, పిల్లి వెంకటేశ్వర్లు , చెడ్డబూషణం అలియాస్‌కాత్రో అలియాస్ గాసి, మాజీ అమరవీరుల బంధుమిత్రుల రాష్ట్ర రక్తబంధు, ఆదివాసి హక్కుల సంఘం సభ్యులు దామోదర్ తిలక్, కోరుకొండ మాజీ కమాండర్ శేఖర్, మహిళా మావోయిస్టు మాజీ జననాట్యమండలి కమాండర్ సీత, మాజీ డిప్యుటి కమాండర్లు సంధ్య, వసంతి, కుమారి మాజీ దళసభ్యురాలు సరోజ, అనకాపల్లి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి, దుప్పిలివాడ సర్పంచ్ కేలేబు కుమారి, గాలికొండ సర్పంచ్, ఎంపిటిసి కాకూరు బుజ్జిబాబు, అంపరంగి బుజ్జిబాబు గుమ్మరేవుల మాజీ సర్పంచ్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పండన్న అంత్యక్రియలకు హాజరైన మాజీ మావోయిస్టులు, అభిమానులు

చింతూరులో ప్రజాదర్బార్ ఏర్పాటు చేయరూ..

పోలవరం నిర్వాసితుల విన్నపం

ప్రజాశక్తి-చింతూరు: ఉమ్మడి రాష్ట్రంగా రాష్ట్ర విభజనకు ముందు చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం, ఎటపాక ప్రజలకు నియోజకవర్గ ఎమ్మెల్యేలు తరచూ అందుబాటులో ఉండేవారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు నేరుగా చెప్పుకునే వెసులుబాటు ఉండడం వలన వారిలో మనో ధైర్యం ఉండేది. ప్రస్తుతం రంపచోడవరం కేంద్రంగా మాత్రమే ఎమ్మెల్యే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఏర్పాటు చేయడంతో, డివిజన్ ప్రజలు నేరుగా నియోజకవర్గ ఎమ్మెల్యేను కలిసే పరిస్థితి అరుదుగా ఉంటోంది. ప్రస్తుతం పోలవరం నిర్వాసితుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ప్రతినెలా గ్రామసభల పేరుతో ప్రతిసారి జిరాక్సు కాపీలు తీసుకురావాలని నిర్వాసితులను అధికారులు తిప్పించుకుంటున్నారు తప్ప ఉపయోగం ఉండడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ఆర్అండ్ఆర్ పునరావాసం తమకు దక్కుతుందో లేదోనని నిర్వాసిత ప్రజానీకం గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గ్రామసభల్లో పోలవరం నిర్వాసిత ప్రజానీకం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న ఆర్అండ్ఆర్ జాబితాలో తమ పేరు రాలేదని చెప్పడంతో కొందరు నిరాశకు గురవుతున్నారు. సాంకేతిక లోపాల వలన స్థానికత పత్రాలలో కొంతమేరలోపం ఉందని అధికారులు పదేపదే జిరాక్సులు తీసుకుని తిప్పుతుండడంతో ప్రజల్లో పోలవరం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పట్ల ఆందోళన నెలకొంది. వారానికి ఒకరోజు ప్రజాఫిర్యాదుల వేదిక చింతూరులో ఏర్పాటు చేయాలని నిర్వాసితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాఫిర్యాదుల వేదికను చింతూరు కేంద్రంలో వారానికి ఒక రోజు చేపట్టాలని ముంపు మండలాల ప్రజలు కోరుతున్నారు.

చింతూరు గ్రామసభలో అధికారులు (ఫైల్ ఫొటో)

తాగునీటి బోర్ల పనులు ప్రారంభం

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి, సిపిహెచ్ క్యాంపు, అల్లూరివీధిలో కొత్తగా బోర్లు తవ్వించేందుకు శనివారం పనులు ప్రారంభించామని సర్పంచ్ పాంగి దుర్గో పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని పంచాయతీ సాధారణ నిధుల నుంచి నిధులు కొంత మొత్తం వెచ్చించి బోరు తవ్వించి ట్యాంకులు ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యాం కల్పించడానికి చర్యలు చేపడతామన్నారు. సమస్యపై ప్రజలు పలుమార్లు తమదృష్టికి తీసుకురావడంతో సమస్య తీర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టి బోర్లు తవ్విస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి ఉపసర్పంచ్ కె.వల్లిప్రసాద్ వైసిపి కార్యకర్త బుజ్జి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సర్వారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. శరభవరం గ్రామానికి చెందిన తిరుపతిరాజు, హర్షిత్ వర్మ బైక్‌పై కాకరపాడు వెళుతుండగా శరభవరం శివారులో కుక్కలు అడ్డురావడంతో ఎదురుగా వస్తున్న ఆటో అదుపుతప్పి వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో తిరుపతిరావు, అతని కుమారుడు హర్షిత్‌వర్మ తీవ్రంగా గాయపడ్డారు క్షతగాత్రులను స్థానికులు రాజవొమ్మంగి పిహెచ్‌సికి తరలించారు. పిహెచ్‌సి సిబ్బంది ప్రథమచికిత్స చేసి మెరుగైన చికిత్సకు ఏలేశ్వరం తరలించారు.

చికిత్స పొందుతున్న తిరుపతిరావు, హర్షిత్

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

విజేత జట్టుకు షీల్డ్ అందిస్తున్న జెకెసి ట్రస్టు చైర్మన్ జమాల్‌ఖాన్

ప్రజాశక్తి-విఆర్‌పురం: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకెసి ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ జమాల్‌ఖాన్ అన్నారు. మండలంలో గత నెలలో ప్రారంభమైన క్రికెట్ ప్రీమియర్ లీగ్ మాచ్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం విజేతలకు నగదు, షీల్డ్‌లను అందజేశారు. రన్నర్స్‌కు మొదటి ప్రైజ్‌మనీ రూ.20 వేలతో పాటు విజేతలకు మరియు నిర్వహణకు గాను రూ.50 వేలు తన ట్రస్ట్ ద్వారా అందజేశారు. ఈ మ్యాచ్‌లో విఆర్ పురం జట్టు విజేతగా నిలిచింది రన్నర్లుగా అడివి వెంకన్నగూడెం క్రీడాకారులు ఉన్నారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ నేటి యువత దురలవాట్లకు లోనుకాకుండా క్రీడలపై దృష్టి సారించి ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరచాలని జాతీయస్థాయిలో కూడా ఎన్నిక కావాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముత్యాల రామారావు, మార్కెట్ కమిటీ సభ్యులు పసుపులేటి సాలమన్‌రాజు, ముత్యాలశ్రీరామ్, మల్లిఖార్జునరావు, జెకెసి ట్రస్ట్‌సభ్యులు రియాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో బేకరీ దగ్ధం

ప్రజాశక్తి-రంపచోడవరం : మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ సెంటర్‌లోని వెంకటేశ్వర అయ్యంగారి బెంగళూరు బేకరీలో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. గమనించిన బేకరీ నిర్వాహకులు, చుట్టు పక్కలషాపుల వారు విషయాన్ని రంపచోడవరం అగ్నిమాపక సిబ్బందికి తెలియచేశారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో కొద్దిపాటి ఆస్తినష్టం సంభవించిందని ఎంత మేరకు ఆస్తినష్టం జరిగిందనే విషయం అంచనా వేయాల్సి ఉందని అగ్నిమాపక శాఖాధికారులు తెలిపారు.

దగ్ధమైన సామగ్రి

కూర పనసకు డిమాండ్

సేంద్రీయ సాగుతో రైతులకు అధిక ఆదాయం

నిండుగా కాయలతో కూర పనస చెట్టు

ప్రజాశక్తి- చింతపల్లి: అల్లూరి ఏజెన్సీ ప్రాంతాల్లో పండే కూరపనసకు మార్కెట్లో డిమాండ్ ఏర్పడింది. ప్రత్యేకించి చింతపల్లి మండలంలో సేంద్రీయ పద్ధతుల్లో పండించిన కూర పనస ధరలు రికార్డు స్థాయికి చేరాయి. గత నెలలో 100 కిలోల ధర రూ.2000గా ఉండగా ఈ పండు ప్రస్తుతం రూ.4000 పలుకుతోంది. అంటే నెల రోజుల వ్యవధిలో ధరలు రెట్టింపయ్యాయి. ఈ ధరల పెరుగుదల గిరిజన రైతులకు కొత్త ఆశలు చిగురిస్తోంది. ఎలాంటి రసాయనిక ఎరువులు లేకుండా, సంపూర్ణంగా సేంద్రీయ విధానంలో కూరపనసను సాగు చేస్తున్నామని, దీంతో మంచి రుచి, మోటు కలిగిన పండ్లు లభిస్తున్నాయని రైతులు తెలిపారు. పండ్లకు ఉన్న మంచి డిమాండ్ మూలంగా మార్కెట్లో కొనుగోలుదారులు ఎక్కువగా వస్తున్నారని, తమ పంటకు న్యాయమైన ధర లభించడంతో మరోసారి సాగు విస్తరించేందుకు సిద్ధమవుతున్నామని పేర్కొన్నారు. కూరపనసకు చల్లని వాతావరణం, ఎర్ర మట్టివేళ్ళ అనుకూలంగా ఉండటంతో ఈ ప్రాంతం ప్రధాన ఉత్పత్తి కేంద్రంగా నిలుస్తోంది. చింతపల్లి, గూడెం కొత్త వీధి మండలాల నుంచి స్థానిక మార్కెట్లకు, కొంతమంది వ్యాపారులు విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు. ఇటువంటి ధరలు లభిస్తే మరిన్ని వ్యవసాయ భూములలో కూరపనస సాగు చేయాలని ఉత్సాహంగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వంతో పాటు వ్యవసాయ శాఖ అధికారి పర్యవేక్షణలో మార్కెట్ సదుపాయాలు, రవాణా సౌకర్యాలు మెరుగు పరిస్తే రైతులకు మరింత లాభం చేకూరుతుందన్న అభిప్రాయం గిరి రైతులలో వ్యక్తమవుతోంది.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం సురక్షితం

పరీక్షిస్తున్న ప్రసూతి వైద్య నిపుణురాలు వాసవి

ప్రజాశక్తి-చింతపల్లి: ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే గర్భిణులు ప్రసవం చేయించుకోవడం తల్లీబిడ్డల ఆరోగ్యానికి ఎంతో సురక్షితమని ప్రసూతి వైద్య నిపుణురాలు ఎస్. వాసవి తెలిపారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో నిర్వహించిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, మొత్తం 190 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కాన్లు నిర్వహించామన్నారు. గర్భిణులు సకాలంలో ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని, పోషకాహారం తీసుకుంటూ ఉండాలని సూచించారు. ప్రసవ సమయం సమీపిస్తే, పురిటి నొప్పులు వచ్చేదాకా వేచి ఉండకుండా, పది రోజులు ముందే స్థానిక గర్భిణుల వసతి గృహంలో చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక, వైద్య అధికారులు భారతి, లావణ్య, ఇతర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగునీరు

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి- రంపచోడవరం : మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. దీంతో రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీనికి సంబంధించి అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. రంపచోడవరంలోని స్థానిక సాయిబాబా ఆలయం వెనుకవీధి బి టైపు క్వార్టర్స్‌లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో క్వార్టర్స్‌లో నివాసం ఉండేవాళ్లు వాడిన నీరు సాయిబాబా గుడి వెనక వీధిలోని రోడ్లపై చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ప్రభుత్వ ఆసుపత్రికి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి, కళాశాలలకు ఈ రోడ్డు గుండానే వెళ్లాలి. రోడ్డుపై మురుగనీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీని పునరుద్ధరణ చేయాలని వారు కోరుతున్నారు.

బివిఆర్ ట్రస్ట్ ద్వారా సేవలు

మాట్లాడుతున్న బి.వి.రామ్

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: తన తండ్రి బి.వి.రామారావు ఆశయ సాధన లక్ష్యంగా బి.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించనున్నట్లు తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తెలిపారు. శనివారం ఒక హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలుగు ప్రజల ఆరాధ్య నాయకుడు, సమైఖ్య ఆంధ్రప్రదేశ్‌కు రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన నందమూరి తారక రామారావు జయంతి రోజున బివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వైసిపి దుర్మార్గపు పాలనలో అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు శాసనసభలో మాట్లాడుతూ, ఇది గౌరవసభ కాదు కౌరవసభ అని చెప్పారని, అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూడా ఒక కౌరవుడు ఉన్నారని, ఆయన ఆయన గాజువాక ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అని విమర్శించారు. వైసిపి కోవర్టుగా వ్యవహరిస్తూ గాజువాకలో పల్లా శ్రీనివాసరావు అరాచకాలను సష్టిస్తున్నారని, ఆయన దురాగతాలపై విచారణ చేపట్టవలసిన అవసరం ఉందని అన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి, పార్టీ నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా రామ్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కొల్లి రత్నకుమారి, వేగి రాధాకష్ణ, డాక్టర్ కె.సురేష్‌బాబు,వి.వంశీబాబు, కె.పరమేష్, పీతల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లోకోషెడ్‌లో తనిఖీలు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శనివారం ఉదయం విశాఖపట్నంలోని విద్యుత్ లోకోషెడ్, రికార్డింగ్ యూనిట్లను, సిబ్బంది పనితీరును, వివిధ నిర్వహణా సౌకర్యాలను తనిఖీ చేశారు. అక్కడి సిబ్బంది, సాంకేతిక నిపుణులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఈస్ట్‌కోస్ట్ రైల్వే సహాయక మోటార్ విభాగం, వీల్స్ మాడ్యుల్‌షాప్, ట్రాక్షన్ కన్వర్టర్, పవర్‌మాడ్యుల్ మరమ్మతులు, పరీక్షా విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విస్తరణ పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వాల్తేరు డిఆర్‌ఎం లలిత్‌బోహ్రా, ప్రధాన విద్యుత్‌ఇంజినీర్ ఆలోసాహాయ్, ముఖ్య పరిపాలనా అధికారి అంకుష్ గుప్తా, సీనియర్ విద్యుత్ ఇంజినీర్ (ఇఎల్‌ఎస్) బి.షణ్ముకరావు ఉన్నారు.

గీతం ఆసుపత్రికి ఎన్‌ఎబిహెచ్ గుర్తింపు

మాట్లాడుతున్న గీతం ప్రో విసి గీతాంజలి

ప్రజాశక్తి-మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న గీతం ఆసుపత్రికి జాతీయ స్థాయిలో నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ఎన్‌ఎబిహెచ్) గుర్తింపు లభించిందని జిమ్సర్ ప్రోవైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి వెల్లడించారు. శనివారం జిమ్సర్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ, రుషికొండ సమీపంలోని గీతం ఆసుపత్రిలో అత్యుత్తమ ప్రమాణాలతో వైద్య సేవలు అందించడం, ఆసుపత్రి నిర్వహణ, సామాన్యులకు సహితం వైద్య సేవలను అందేలా ప్రణాళికలు తదితరి అంశాలను పరిగణనలోకి తీసుకుని క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు చెందిన ఎన్‌ఎబిహెచ్ సర్టిఫికేట్ మంజూరు చేసిందన్నారు. గీతం ఆసుపత్రికి ఎన్‌ఎబిహెచ్ గుర్తింపు రావడంలో వైద్య నిపుణులు, పారామెడికల్ సిబ్బంది సమిష్టి కృషి ఉందన్నారు.

గీతం ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, సర్జరీ, పెడియాట్రిక్స్, ఈఎన్‌టి, ఆప్థామాలజి, పల్మనరీ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, డెర్మటాలజి, ఫిజియోథెరపి, అనస్తీసియాలజి, గైనకాలజి వైద్య విభాగాలతో పాటు కార్డియాలజి, కార్డియోథోరాసిక్ సర్జరి, ఎండోక్రైనాలజి, మెడికల్ అండ్ సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజి, న్యూరోమెడిసిన్, న్యూరోసర్జరీ, యూరాలజి, పెడియాట్రిక్ సర్జరి, ఇంటర్‌వెన్షనల్ రేడియాలజి, క్రిటికల్ కేర్ సూపర్ స్పెషాలిటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

గీతం ఆసుపత్రిని 750 పడకలతో, ఏడు ఐసియు పడకలు, ఇంటెన్సివ్ కేర్‌యూనిట్, 16 మేజర్, మూడు మైనర్ ఆపరేషన్ ధియేటర్లతోపాటు అధునాతన డయాలసిస్ యూనిట్, కేథ్‌ల్యాబ్, రేడియాలజీ, పెయిన్‌క్లినిక్‌లతో అత్యున్నత ప్రమాణాలతో అభివృద్ధి చేసామన్నారు. రౌండ్‌దిక్లాక్ అంబులెన్స్ (9491761246) సేవలు అందిస్తూ,ఎన్‌టిఆర్ వైద్య సేవ, ఇఎస్‌ఐ, ఇహెచ్‌ఎస్, బిఎస్‌కెవై ద్వారా ప్రజలు వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. సమావేశంలో జిమ్సర్ అక్రిడిటేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణకార్తీక్ భోగవల్లి, జిమ్సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వివి.నరిసింహరావు, ఎన్‌ఎబిహెచ్ గీతం పర్యవేక్షకురాలు డాక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సేవాభావం

రైలు జనరల్ బోగీల్లోని ప్రయాణికులకు మంచినీటి బాటిళ్ల పంపిణీ

రైలు జనరల్ బోగీల్లోని ప్రయాణికులకు మంచినీటి బాటిళ్లను అందిస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి-ఉక్కునగరం : దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొంతమంది స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులంతా పదిరోజులుగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న రైలు ప్రయాణికులకు మంచినీటి బాటిళ్లను అందించి వారి దాహార్తిని తీరుస్తున్నారు. రైల్వే యూజర్స్ అసోసియేషన్ కార్యదర్శి జెడ్‌ఆర్‌సిసి సభ్యులు కొంచె మూర్తి ఈశ్వర్, మానవ వికాస వేదిక ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌ఎన్ మూర్తి, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాషువా, మానవ వికాస వేదిక సభ్యులు జివి రావు ఇలా పలువురు రిటైర్డ్ ఉద్యోగులంతా మండుటెండల్లో గొంతెండిపోతున్న రైలు ప్రయాణికులకు మంచినీటి బాటిళ్లన అందించి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ప్రశాంతి, జన్మభూమి, వాస్కోడిగామా వంటి రద్దీగా ఉండే రైళ్లలో జనరల్ భోగిల్లో ఆపసోపాలు పడుతున్న వారికి ప్రతిరోజూ 500 వరకు నీటి బాటిళ్లను అందిస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులంతా తమకు వస్తున్న పెన్షన్ సొమ్ములో కొంత మొత్తాన్ని ఇలా వినియోగిస్తూ సేవాభావాన్ని చాటుకుంటూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి
12న యుటిఎఫ్ ధర్నా

విశాఖ డిఇఒకు నోటీసు ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు, పాఠశాలల పునర్వ్యస్థీకరణ తదితర విషయాలపై ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12న యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్‌ను కలిసి ధర్నా నోటీసును అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 12న నిర్వహించే జిల్లాస్థాయి ధర్నా లో సమస్యలు పరిష్కరించని పక్షంలో 15న రాష్ట్ర విద్యాశాక డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన చేపడతామని తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

జివిఎంసి, ప్రజారోగ్య అధికారులు దృష్టి సారించాలి
విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ: మహావిశాఖ నగరాన్ని నిత్యం పరిశుభ్రపరచడంలో రాత్రి పారిశుధ్య కార్మికుల విధుల పనితీరును మెరుగుపరచడంలో జివిఎంసి, ప్రజారోగ్య అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగరంలో ఆర్కే బీచ్, జగదాంబ జంక్షన్ పరిసరాల్లో రాత్రి సమయంలో పారిశుధ్య పనులు పరిశీలించారు. ముందుగా ఆర్కే బీచ్ వద్ద ఉన్న పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికను తనిఖీ చేసి రోజూ పారిశుద్ధ్య కార్మికులు ఎంతమంది వస్తారు, ఎన్ని గంటలకు హాజరై రోడ్డు, బీచ్ పరిసరాలు పరిశుభ్రం చేస్తున్నారని, కొంతమంది సెలవులలో ఎందుకు వెళ్తున్నారని ప్యాకేజీ నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌ను ఆరా తీశారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ వారికి సరఫరా చేసిన ఊడ్చే చీపురులను తనిఖీ చేసి నాణ్యత బాగులేదని, వాటిని మార్చాలని, అలాగే ఇంకా చీపుర్లు ఎంత స్టాక్ ఉన్నాయో నివేదిక అందించాలని, పారిశుద్ధ్య కార్మికులకు అవసరమయ్యే పనిముట్లు, డస్ట్‌బిన్లు, తోపుడుబళ్లు సమకూర్చాలని సహాయ వైద్యాధికారి డాక్టర్ కష్ణంరాజును ఆదేశించారు. అనంతరం బీచ్‌లో ఎక్కువగా వ్యర్థాలను గమనించిన మేయర్ దుకాణాల వద్దకు వెళ్లి డస్ట్‌బిన్లలో పర్యాటకులు, సందర్శకులు వినియోగించిన వ్యర్థాలను వేసేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి దుకాణం దగ్గర డస్ట్‌బిన్ తప్పకుండా ఉండాలని దుకాణదారులకు అవగాహన కల్పించాలని, అలా సహకరించని వారి షాపులను తొలగించాలని ఆదేశించారు. సందర్శకులకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకడ్రైవ్ చేపట్టాలని, అలాగే బీచ్‌లో ఉన్న టాయిలెట్లను నిత్యం పరిశుభ్రపరిచేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. స్నానపు గదులు కూడా ఉండేలా సందర్శకులకు, విహార యాత్రికులకు సౌకర్యాలను కల్పించాలని సహాయ వైద్యాధికారికి మేయర్ ఆదేశించారు.

కాస్మోటాలజీ, న్యూట్రిషన్ కోర్సులకు
దరఖాస్తుల స్వీకరణ

మాట్లాడుతున్న స్వస్థ ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: సెంచూరియన్‌విశ్వవిద్యాలయంతో కలసి స్వస్థ ఇన్స్టిట్యూట్‌లో కాస్మోటాలజీ, న్యూట్రిషన్‌లో పిజీ డిప్లొమా కోర్సుల ప్రారంభమయ్యాయని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని స్వస్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అలైడ్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వస్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అలైడ్ సైన్సెస్ నుంచి కాస్మోటాలజీ, పారామెడికల్ సైన్సెస్‌లో కీలకమైన కెరీర్ అవకాశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు కాస్మోటాలజీ, డైట్‌అండ్ న్యూట్రిషన్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులను అందించడానికి సెంచూరియన్ విశ్వవిద్యాలయంతో ముఖ్యమైన విద్యాసహకారాన్ని ప్రకటించడం లక్ష్యంగా కోర్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, వెల్‌నెస్, సౌందర్యం వంటి అంశాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలుగా కొనసాగుతున్నందున, వత్తిపరంగా శిక్షణ, సర్టిఫైడ్ విద్యార్థులకు అధిక డిమాండ్ ఉందన్నారు. ఆశావహులైన నిపుణులు బలమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న కెరీర్‌లను నిర్మించడంలో సహాయపడటానికి అధికనాణ్యత, ఆచరణాత్మక విద్యను అందించడం లక్ష్యంగా కోర్సులు నేర్పిస్తున్నామన్నారు. అకడమిక్ ఎక్సలెన్స్, అత్యాధునిక పరిశోధనలు, సమగ్ర ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ హెల్త్‌కేర్ సేవల ద్వారా స్థిరమైన ఆరోగ్య పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యమని రాజీవ్ అన్నారు. సంస్థ గుర్తింపు పొందిన సంస్థల నుండి అక్రిడిటేషన్లను కొనసాగిస్తోందన్నారు. దాని ప్రభావాన్ని విస్తరించడానికి విద్యా, ఆరోగ్య సంరక్షణ సంస్థలతో సహకారాన్ని ఏర్పరుస్తుందన్నారు. స్వస్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అలైడ్ సైన్సెస్ మేనేజింగ్ పార్టనర్ డాక్టర్ హరిత మాట్లాడుతూ స్వస్థ సుచన్, ఆరోగ్య సంరక్షణ, విద్య, పరిశోధనలకు సమగ్ర విధానం ద్వారా సమాజ శ్రేయస్సును పెంపొందించడానికి అంకితమైన సంస్థగా అభివర్ణించారు. స్వస్థ సుచన్ విస్తతసేవలను వివరిస్తూ టెలిమెడిసిన్ అందిస్తామన్నారు. వ్యక్తి సంరక్షణ, జీవనశైలి రుగ్మత నిర్వహణ కార్యక్రమాలను అందిస్తామన్నారు. స్వస్థ సుచన్ హెల్త్‌కేర్,యోగా థెరపీ, ఇంటిగ్రేటివ్ మెడిసిన్‌లో సర్టిఫికేట్ డిప్లొమా కోర్సులను కూడా అందిస్తున్నామన్నారు. డాక్టర్ అనంత మాట్లాడుతూ క్లినికల్ కాస్మోటాలజీ, సౌందర్య చికిత్స, అధునాతన హెయిర్ డిజైన్‌లో కోర్సులు పరిశ్రమ అవసరాలను తీరుస్తాయన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం సహకారం పాఠ్యాంశాల అభివద్ధి, ఫ్యాకల్టీ మార్పిడి, ఇంటర్న్‌షిప్ అవకాశాలను మెరుగుపరుస్తుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమాలు లాక్మే, ఎల్ ఓరియల్ వంటి అగ్రబ్రాండ్‌లతో కెరీర్‌లకు విద్యార్థులను సిద్ధం చేస్తాయన్నారు. వివరాలకు 6304326204, 8309159894 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గురుకులాల ఇంటర్ ప్రవేశ పరీక్షలో
స్టేట్ టాపర్‌గా గీతిక



తల్లిదండ్రులతో గీతిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపి గురుకులాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి నిర్వహించిన బిఆర్‌జిసిఇటి - 2025 ఫలితాల్లో విశాఖ జిల్లా జివిఎంసి ఐదవ వార్డు కొమ్మాదికి చెందిన రఘుపతి గీతిక రాష్ట్రస్థాయిలోనే టాపర్‌గా నిలిచింది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు నగరంలోని బుచ్చిరాజుపాలెం డివివి స్కూల్‌లో చదివిన గీతిక, పదో తరగతి వరకు సిబిఎస్‌ఐ సిలబస్‌తో మధురవాడ బ్రాంచి నారాయణ స్కూల్‌లో చదివింది.టెన్త్ సిబిఎస్‌ఐ ఫలితాలు ఇంకా విడుదల కాలేదు. కాగా పాఠశాలలో వారాంతపు పరీక్షల్లో ఎపుడూ మొదటి రెండుస్థానాల్లో నిలిచిన గీతిక, గురుకుల ప్రవేశపరీక్షలో రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలుస్తుందని ముందుగా ఊహించాలని పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థినులు అంటున్నారంటే, ఆమెపై వారికెంత నమ్మకముందో ఇట్టే తెలుస్తోంది. పాలిసెట్ పరీక్షకు హాజరైన నేపథ్యంలో వాటి ఫలితాల్లోనూ రాష్ట్రస్థాయిలోనే ర్యాంకు సాధిస్తుందని వారుంటున్నారు.

> **సివిల్స్ చదువుతా..**
> సివిల్స్ చదవాలని ఉంది. ఇందుకోసం ప్రయత్నం కొనసాగిస్తాను. ఇంతగా చదవడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణం.
> **రఘుపతి గీతిక,**
> **బిఆర్‌ఎజిసిఇటి రాష్ట్రస్థాయి టాపర్**
> **కొమ్మాది, విశాఖ జిల్లా**

గ్రామీణ నేపథ్యం గల కుటుంబం నుంచి...

గ్రామీణ నేపథ్యం గల కుటుంబం నుంచి వచ్చిన గీతిక, మొదటి నుంచి చదువుపై ఏకాగ్రత కలిగి ఉంది. శ్రీకాకుళం జిల్లా, పొందూరు మండలం, కనిమెట్ట గ్రామానికి చెందిన వెంకట రమణ, రాజ్యలక్ష్మి దంపతులు పెద్ద కుమార్తె గీతిక. సాధారణ వ్యవసాయ కుటుంబం వీరిది. ఉపాధి కోసం కొన్నేళ్ల క్రితం విశాఖ నగరానికి వలస వచ్చిన వీరి కుటుంబం ప్రస్తుతం కొమ్మాదిలో నివాసం ఉంటున్నారు. తండ్రి వెంకటరమణ ప్రజాశక్తి ఉద్యోగి. తల్లి రాజ్యలక్ష్మి ఆశా వర్కర్. వీరికి ఇద్దరు కుమార్తెలు.గురుకుల ప్రవేశపరీక్షలోరాష్ట్రస్థాయి టాపర్‌గా నిలిచిన గీతిక పెద్దమ్మాయికాగా, రెండో కుమార్తె పూజశ్రీ.

అనుమానాస్పద వ్యక్తిపై పోలీసుల అప్రమత్తత

ప్రశ్నిస్తున్న నార్త్‌జోన్ ఎసిపి అప్పలరాజు

ప్రజాశక్తి-మధురవాడ : నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి నుంచి అనుమానాస్పదంగా తిరుగుతూ, కొన్ని ప్రాంతాల్లో ఫొటోలు తీస్తున్న వ్యక్తిపై సోషల్ మీడియా ట్రోలింగ్‌లు వస్తున్న నేపథ్యంలో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. కారుషెడ్ వద్ద ఆ వ్యక్తిని పిఎంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకోగా, నార్త్ సబ్ డివిజన్ ఎసిపిఅప్పలరాజు విచారించారు. అనంతరం ఎసిపి వెల్లడించిన వివరాలు ప్రకారం, ఇండియన్ ఆర్మీలో పనిచేసి, 2023లో రిటైరైన విజయనగరం జిల్లా పక్కి గ్రామానికి చెందిన పెంకి ప్రవీణ్‌కుమార్‌గా గుర్తించారు. కాస్త మతిస్థిమితం లేక తిరుగుతుండగా, ప్రస్తుతం పాక్, భారత్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అతడిని గమనించిన స్థానికులు ఫొటోలు తీసి సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టి వైరల్ చేయడంతో పిఎం.పాలెం సిఐ జి.బాలకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ప్రశ్నించిన తర్వాత, సంబంధిత వ్యక్తి కుటుంబసభ్యులతో సంప్రదించి, ఎటువంటి అనుమానాలు లేవని నిర్ధారించుకున్నాక వారికి అప్పగించారు.

అంధుల పెళ్లికి 'కందుల' సహకారం

పెళ్లికుమార్తెకు తాళిబొట్టు అందిస్తున్న కార్పొరేటర్ నాగరాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ప్రేమసమాజంలో ఈనెల 11న అంధులైన శివజ్యోతి, రాఘవేంద్ర వివాహానికి తాను అన్ని విధాల సహకారం అందిస్తానని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు తెలిపారు. శనివారం ప్రేమ సమాజంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పెళ్లి కుమార్తెకు బంగారు తాళిబొట్టు, పట్టువస్త్రాలు, వెండిమెట్టెలు అందజేశారు. పెళ్లికుమారుడికి పట్టువస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమసమాజం నిర్వహించే కార్యక్రమాలకు తన సహకారం ఉంటుందని తెలిపారు. ప్రేమ సమాజం ఎన్నో సేవాకార్యక్రమాలకు చిరునామాగా నిలిచిందని కొనియాడారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖ నగర సిపి డాక్టర్ శంఖబ్రతబాగ్చీ మాట్లాడుతూ డాక్టర్ కందుల నాగరాజు మంచి పనులకు ఎప్పుడూ ముందు ఉంటారని ప్రశంసించారు. ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, కార్యదర్శి హరిమోహనరావు, జాతీయ జర్నలిస్టుల సంఘ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ప్రేమ గణపతిరావు, అప్పలరాజు ఎంవికె గుప్తా, డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

మతంతో బిజెపి రాజకీయం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని సిపిఐ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని తెలిపారు. సిపిఐ విశాఖ జిల్లా మహాసభల సందర్భంగా కంచరపాలెంమెట్టు నుంచి పాత ఐటిఐ జంక్షన్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం 2014లో ఇచ్చిన హామీలను కూడా నేటివరకూ అమలు చేయలేదన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలకల్పన, నల్లధనాన్ని వెలికితీసి ప్రజలకు పంచుతామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల హామీతో అధికారంలోకి వచ్చిన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచితబస్సు ప్రయాణాన్ని అమలు చేయలేదన్నారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్లస్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షలు సమకూరుస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో పేదలు తహాశీల్దార్ కార్యాలయాల వద్ద ఇళ్లస్థలాల కోసం దరఖాస్తులు అందిస్తే సచివాలయాల కార్యదర్శుల ద్వారా టిడిపి నేతలు దరఖాస్తుదారులను బెదిరించారన్నారు. గత ఎన్నికల్లో సొంతంగా 420 స్థానాలు సాధిస్తామని చెప్పిన బిజెపి అవసరమైన సీట్లు కూడా గెలవలేక బోర్లా పడిందని విమర్శించారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలన్న కేంద్ర ప్రయత్నాలను ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం అడ్డుకుందని తెలిపారు. ఈ నెల20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో గవర్నర్ల వ్యవస్థ సమైక్యస్ఫూర్తిని కాపాడేదిగా లేదని దుయ్యబట్టారు. నెలరోజుల క్రితం రిజిస్టర్ అయిన సంస్థకు విశాఖలో ఎకరా99 పైసలకు భూములు కేటాయించారని, మరోపక్క విశాఖలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి మాత్రం భూములు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, జిల్లా నాయకులు ఎజె.స్టాలిన్, సిహెచ్.రాఘవేంద్రరావు, డి.ఆదినారాయణ, పి.చంద్రశేఖర్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.విమల, ప్రధానకార్యదర్శి దుర్గాభవాని పాల్గొన్నారు.